రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, జనవరి 9: ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్, రోడ్డు భద్రతా కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 31 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాల నిర్వహణకు ఆర్ అండ్‌బీ అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలు 75 నుంచి 80 శాతం డ్రైవర్ల తప్పిదాల వల్లనే జరుగుతున్నాయన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. సమావేశంలో డీసీపీ రవీందర్, సీనియర్ ఎంవీఐ జయపాల్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నేడు విద్యుత్ లోక్ అదాలత్

రాయపర్తి, జనవరి 9 : మండలంలోని మైలారం శివారు సబ్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్వీ వేణుగోపాలాచారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రంలో ఏఈ పెద్ది రవళీరెడ్డి, సబ్ ఇంజినీర్ విక్రమ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో లైన్‌మన్ బడితెపురం వెంకన్న, సిబ్బంది ఎనగందుల ప్రవీణ్‌కుమార్, జంపాల మహేశ్, అకారపు రాజశేఖర్, మహ్మద్ అన్వర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి టీసీసీ పరీక్షలు ప్రారంభం

గిర్మాజీపేట, జనవరి 9 : జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ)కు సంబంధించిన పరీక్షలు శనివారం నుంచి 17 వరకు జరుగుతాయని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ పరీక్షలు 11న, హయ్యర్‌గ్రేడ్ పరీక్షలు 12, 16న, డ్రాయింగ్ లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు 11,12,16,17 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు www. bse.telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

శతాధిక వృద్ధుడు మృతి

లక్ష్మయ్య(ఫైల్)

కరీమాబాద్, జనవరి 9 : రంగశాయిపేటకు చెందిన శతాధిక వృద్ధుడు రావుల లక్ష్మయ్య(110) గురువారం మరణించారు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మయ్య మృతదేహానికి పలువురు నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, తన భూమిని కొందరు ఆక్రమించుకోవడంతో రావుల లక్ష్మయ్య మానసికంగా కుంగిపోయినట్లు పలువురు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

నేను, ఏదునూరి మమత D/o ఏదునూరి సంపత్ నా యొక్క పాస్‌పోర్ట్ డిసెంబర్ 16న కమలాపురం నుండి మంగపేటకు వెళుతుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. నాపాస్‌పోర్ట్ నెం. M8425867 గల పాస్‌పోర్టు మంగపేట, గాని ఇతర ప్రాంతాలలోని ఎవరికి అయిన దొరికితే మంగపేట పోలీస్ స్టేషన్‌లో కానీ, లేదా నాఫోన్ నెం. 9490395672, 7330780394 లలో గాని సంప్రదించి ఇవ్వగలరని ప్రార్థన.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రీడాకారులకు దుస్తులు అందజేసిన గటిక మల్లయ్య

పర్వతగిరి, జనవరి 9: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని చింత నెక్కొండలో క్రికెట్ పోటీలను గురువారం హితకారిణి స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షుడు గటిక మల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులందరికి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.15 వేలను మాజీ సర్పంచ్ గటిక సుష్మా మహేశ్, ద్వితీయ బహుమతి రూ.10 వేలను మాజీ ఎంపీటీసీ కాట్రోజు మౌనికా రాజు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బొల్లం రాకేశ్, వేణుగోపాల్, అనిల్, రాము, మహేశ్, రాజు, టోని, గణేశ్ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

కాశీబుగ్గ, జనవరి 9 : జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శనివారం కాశీబుగ్గలోని ఓసిటీ మైదానంలో జిల్లా స్థాయి జూడో, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. 21 ఏళ్ల లోపు యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. యువకులు 45,50,55,60,66,73,81 కిలోలు, యువతులు 44,48,52,57, 63,70,78 కిలోలు ఆపై బరువు ఉండాలని తెలిపారు. వివరాల కోసం జూడో కోచ్ కుమారస్వామి(9390955372), క్రికెట్ కోచ్ సుమన్(8919069469)ను సంప్రదించాలని సూచించారు.

కబడ్డీ క్రీడోత్సవాలను జయప్రదం చేయాలి

రాయపర్తి, జనవరి 9 : మండల కేంద్రంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలకు విజయవంతం చేయాలని టోర్నమెంట్ నిర్వాహకులు ఉమేశ్, బి.నగేశ్, సీహెచ్ రాజు కోరారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికితీయడంతోపాటు వారిలో సమైక్యతా భావాన్ని పెంపొందించేందుకు ఎనగందుల సంతోష్‌కుమార్, బక్కతట్ల రాజశేఖర్ సహకారంతో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10,116, ద్వితీయ బహుమతి రూ.6,116, తృతీయ బహుమతి రూ.4,116 అందజేయనున్నట్లు వివరించారు. వివరాలకు 7801053093, 9391237996, 9346706358 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత

సంగెం/నెక్కొండ/చెన్నారావుపేట/వర్ధన్నపేట, జనవరి 9 : సంగెం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, ఎస్సీ హాస్టల్‌లోని విద్యార్థులకు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్ గురువారం పరీక్ష ప్యాడ్స్, మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులతో కలిసి అధికారులు భోజనం చేశారు. ఎంఈవో రాము, ఎంపీవో కొమురయ్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి నీలిమ, వార్డెన్లు పాల్గొన్నారు. అలాగే, నెక్కొండలోని కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ సమకూర్చిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్‌బాక్స్‌లు, డిక్షనరీ, జామెట్రీ బాక్స్‌లను మండల ప్రత్యేక అధికారి కే అనురాధ పంపిణీ చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో నాగరాజు, ప్రత్యేక అధికారి రజిత పాల్గొన్నారు. చెన్నారావుపేట సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థులకు మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో స్టేషనరీని అందజేశారు. అలాగే, అమీనాబాద్ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌కు జల్లి గ్రామానికి చెందిన తొగరు చెన్నారెడ్డి తన తల్లిదండ్రులు విజయా-గోవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం గ్యాస్ స్టౌ, మిక్సీ అందజేశారు. ఉపాధ్యాయులు రాజు, భాస్కర్, మేడి సుధాకర్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. వర్ధన్నపేట మండలం కట్ర్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని అందజేశారు. జిల్లా కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చొప్పరి సోమయ్య, సంపత్‌రెడ్డి, హెచ్ఎం వెంకటేశ్వర్లు, పీఈటీ సోమన్న పాల్గొన్నారు.

సీజేఐ అత్యుత్తమ జాతీయ ఉపాధ్యక్షుడిగా రమేశ్

కరీమాబాద్, జనవరి 9 : సీజేఐ ఇండియా అత్యుత్తమ జాతీయ ఉపాధ్యక్షుడిగా కరీమాబాద్‌కు చెందిన రమేశ్ దడిగలకు అవార్డు దక్కింది. ప్రముఖ సైకాలజిస్ట్ కార్పొరేట్ ట్రైనర్‌గా, బిజినెస్ కోచ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ కోచ్‌గా ఆయన సేవలిందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ అత్యుత్తమ జాతీయ ఉపాధ్యక్షుడిగా అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

గీసుగొండ, జనవరి 9 : పేకాడుతున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్, గీసుగొండ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు. పోతురాజుపల్లి శివారులోని చెట్ల పొదళ్లలో కొంత మంది పేకాడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు వెళ్లి వారి పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో వరంగల్‌కు చెందిన పుప్పాల రాజ్‌కుమార్, నల్ల కుమార్, పులుచేరు రాజేశ్, బోనగిరి శ్రీనివాస్ ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.8,670 నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఖిలావరంగల్, జనవరి 9 : ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం లేబర్‌కాలనీ ఎస్ఆర్టీ నగర్‌లో జరిగింది. మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం.. లేబర్‌కాలనీకి చెందిన కందగట్ల రాజేశ్(30) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మందులు వాడినా కుదుట పడకపోవడంతో మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

నెక్కొండలో ఉపాధి హామీ ప్రజావేదిక

- ఉద్యోగుల నిర్లక్ష్యంపై డీఆర్‌డీవో ఆగ్రహం
- నలుగురు టీఏలు, ఈసీ, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

ప్రజావేదికలో డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎంపీడీవో తదితరులు

నెక్కొండ, జనవరి 9 : మండలంలో ఉపాధిహామీ పథకం అమలులో ఉన్నతాధికారుల ఆదేశాలను సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదని, విధుల్లో ఉపాధిహామీ ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ డీఆర్‌డీవో కౌసల్యాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందాలు అందించిన నివేదికలపై డీఆర్‌డీవో కౌసల్యాదేవి పలువురికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. మండలంలో పనిచేస్తున్న నలుగురు టెక్నికల్ అసిస్టెంట్స్ యాకాంతం, కవి, రజిత, మనోహర్, ఈసీ బీ రజితకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. పథకం అమలులో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీ రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదని, పర్యవేక్షించాల్సిన ఏపీవో జాకబ్ సైతం మరింత గట్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని దీక్షకుంట, ముదిగొండ గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్స్ సత్యం, ప్రేమ్‌కుమార్‌తోపాటు నెక్కొండ తండా పంచాయతీ కార్యదర్శి మహమూద్, ముదిగొండ పంచాయతీ కార్యదర్శి షమికి కూడా షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. మొక్కలను రక్షించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందని ధ్వజమెత్తారు. కాగా, తమ గ్రామంలో హైదరాబాద్‌లో ఉంటున్న వారు సైతం ఉపాధిహామీ కూలి పొందుతున్నారని చిన్నకొర్పోలుకు చెందిన ఓ వ్యక్తి డీఆర్‌డీవోకు ఫిర్యాదుచేయగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఓ దశలో నలుగురు టీఏలు, ఈసీని బదిలీ చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. మండలంలోని 39 పంచాయతీలకు సంబంధించిన పనులకుగాను రాత్రి ఏడు గంటల వరకు 26 పంచాయతీలకు సంబంధించి నివేదికలను మాత్రమే ప్రజావేదికకు సమర్పించారు. మండల ప్రత్యేక అధికారి అనురాధ, క్వాలిటీ కంట్రోల్ అధికారి పుష్పలత, పంచాయతీరాజ్ ఏఈ రాజ్‌కుమార్, ఎస్ఆర్‌పీ చెన్నకేశవులు, డీవీసీ మాధవి, ఏపీఎంలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు సహకరిస్తాం

యువ కళా పురస్కారం అందుకుంటున్న వనపర్తి రాజేంద్రప్రసాద్

పోచమ్మమైదాన్, జనవరి 9 : సీనియర్ సిటిజన్ హక్కులకు పూర్తి సహకారం అందజేస్తానని జిల్లా సంక్షేమ అధికారి బీ రాజమణి అన్నారు. శ్రీ మహదేవ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ వరంగల్ జిల్లా క్యాలెండర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు నన్నపు సంజీవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు అవసరమైన హక్కులు, ఇతర అవసరాల కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బీ సాంబశివరావు, సంస్థ ప్రధాన కార్యదర్శి ముద్దసాని మల్లిక, కోశాధికారి యెలుగం వెంకటమల్లు, చిప్ప వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ దస్తగిరి, టీజీవో నాయకులు ఏ జగన్ మోహన్‌రావు, కోలా రాజేశ్‌గౌడ్, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, కోటేశ్వర్‌రావు, సమ్మయ్య, మదనయ్య, కేడల పద్మ, సదానందం, దాసరి రాము, యెలగం చిన్న కొమురయ్య, ఆనందమోహన్, రాజగోపాల్‌రావు పాల్గొన్నారు.

ఓరుగల్లు కళాకారులకు పురస్కారాలు

పోచమ్మమైదాన్, జనవరి 9: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ 41వ వార్షికోత్సవం సందర్భంగా పద్య, సాంఘిక, నాటక, వివిధ కళారూపాల్లో విశిష్టసేవలు అందించిన కళాకారులకు జీవిత సాఫల్య పురస్కారం, యువ పురస్కారం-2024 ప్రదానం చేశారు. ఇందులో భాగంగా పౌరాణిక, సాంఘిక, నాటక రంగంలో విశిష్ట సేవలు చేస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన వనపర్తి రాజేంద్రప్రసాద్‌కు యువ కళా పురస్కారం, ఓడపల్లి చక్రపాణికి జీవిత సాఫల్య పురస్కారాన్ని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మేయర్ వై సునీల్‌రావు, కుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ కళాకారులు దేవరాజు రవీంద్రరావు, గూడూరు బాలాజీ, జూలూరు నాగరాజు పాల్గొన్నారు.

ఉర్సు దర్గా వద్ద అన్నపూర్ణ క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

కరీమాబాద్, జనవరి 9 : ఉర్సు దర్గా వద్ద అన్నపూర్ణ క్యాంటీన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం స్థలాన్ని పరిశీలించి, చదును చేశారు. మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఇక్కడ క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. గత నవంబర్ 30న దర్గా వద్ద రూ.5 భోజనం క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి సురేఖకు ఉర్సుకు చెందిన గడ్డం యుగేందర్ గౌడ్ వినతిపత్రం అందజేశారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

దుగ్గొండి, జనవరి 9 : మండలంలోని గిర్నిబావి జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే టీం ఆధ్వర్యంలో మూడు రోజులుగా వైద్య శిబిరం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో 230 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశామని, రక్తహీనత ఉన్న వారికి మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్లు మధుల, ఎన్ఎన్ఎం దివ్య, ఫార్మాసిస్ట్ అన్నపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ శారద పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్ల ర్యాలీ

వర్ధన్నపేట, జనవరి 9 : రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం వర్ధన్నపేటలో ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు చందర్, రాజు పాల్గొని మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా నడుచుకోవాలన్నారు. నిబంధనలు పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు, ఆటో డ్రైవర్లుపాల్గొన్నారు.

టీపీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా రమ్యకుమారి

నర్సంపేట, జనవరి 9 : తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) వరంగల్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా మండలంలోని రాజపల్లి పంచాయతీ కార్యదర్శి కడగండ్ల రమ్యకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, జిల్లా కార్యవర్గ సభ్యులుగా పాతముగ్దుంపురం పంచాయతీ కార్యదర్శి మహ్మద్ శంషోద్దీన్, ముగ్దుంపురం పంచాయతీ కార్యదర్శి షేక్ రహీం పాషా, ఇప్పల్‌తండా పంచాయతీ సెక్రటరీ హైమ ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

ఖిలావరంగల్, జనవరి 9 : ఖిలావరంగల్ మండలం ఉర్సు శివారులోని 354, 355 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో డీటీకి గురువారం వినతి పత్రం సమర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, సంగీ ఏలేందర్, ఓర్సు రాజు, ఎండీ అక్బర్, మంద నవీన్, పోలెపాక మల్లేశ్, సునీత, నర్సింగ్, రమేశ్, రాము పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలి

ఖిలావరంగల్, జనవరి 9: రైతుల పంటలకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. ఈ మేరకు గురువారం సంఘం ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్‌లో ఏవో విశ్వప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మైదం పాణి, నాయకులు అర్షం సుధాకర్, సతీశ్, ప్రకాశ్, రమేశ్, నరేశ్, వెంకన్న పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ఖిలావరంగల్, జనవరి 9 : బైక్‌ను ఢీకొని ఒకరిని గాయాలపాలు చేసిన ఆటోడ్రైవర్‌పై గురువారం మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం. ఈ నెల 4న రాజరెడ్డి తన బైక్‌పై వరంగల్‌కు వెళ్తుండగా ఏఎస్ఎం కాలేజీ సమీపంలో గ్యాస్ ఆటో డ్రైవర్ శ్రీధర్ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో రాజిరెడ్డికి గాయాలు కాగా, ఎంజీఎం దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడుకోవాలి'

గిర్మాజీపేట, జనవరి 9 : యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు అన్నారు. యూజీసీ తీసుకువచ్చిన కొత్త నిబంధనలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం సాకరాశికుంట జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనలు యూనివర్సిటీల మనుగడకు ప్రమాదంగా మారాయన్నారు. యూజీసీ నిబంధనల ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్, ఇర్ఫాన్, బురహాన్, రహేల్, వినయ్, రంజిత్, ఉదయ్, అక్బర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కర్ర లారీ బోల్తా


రహదారిపై పడిపోయిన లారీ

వర్ధన్నపేట, జనవరి 9 : మండలంలోని ఇల్లంద శివారులో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కర్ర లారీ బోల్తా పడిన ఘటన గురువారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తొర్రూరు వైపు నుంచి వరంగల్‌కు జామాయిల్ కర్ర లోడుతో వెళుతున్న లారీ ఇల్లంద శివారులో రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కర్ర రహదారికి దూరంగా పడిపోవడంతో పాటు క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్లకు స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను చికిత్స కోసం దవాఖానకు తరలించారు. పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా కర్రను పక్కకు వేయించారు.

విద్యార్థుల హార్డ్ కాపీలు సమర్పించాలి

గిర్మాజీపేట, జనవరి 9 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 2022-23, 2023-24 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హార్డ్ కాపీలను ప్రిన్సిపాళ్లు ఈ నెల 25లోగా జిల్లా బీసీ కార్యాలయంలో సమర్పించాలని ఆ శాఖ అభివృద్ధి అధికారి ఏ పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 32,490 మంది బీసీ విద్యార్థుల్లో 29,479 మంది విద్యార్థుల హార్డ్‌కాపీలను మాత్రమే పంపారని మిగిలిన 3,011 మంది హార్డ్ కాపీలను పంపించాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ఇప్పటివరకు కళాశాలకు విడుదలైన నిధుల యుటిలైజేషన్ సర్టిఫికెట్లు కూడా సమర్పించాలని ఆమె సూచించారు.

వాటర్ ప్లాంట్ నిధులు పక్కదారి

దుగ్గొండి, జనవరి 9 : తిమ్మంపేట గ్రామంలో బాల వికాస వాటర్ ప్లాంట్ నిధులు పక్కదారి పట్టాయి. 2019-24 వరకు అధ్యక్ష,కార్యదర్శులుగా వ్యవహరించిన మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్, మాజీ ఉపసర్పంచ్ కత్తి ఏకాంబరం వాటర్ ప్లాంట్ ఆర్థిక లావాదేవీల్లో రూ.3.57లక్షలు దుర్వినియోగం చేశారని, గ్రామస్తుల డబ్బులను వ్యక్తిగత అవసరాలకు వాడుకొని, తప్పుడు పత్రాలు చూపించారని బాల వికాస వాటర్ ప్లాంట్ నూతన అధ్యక్షుడు బైరి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు

అమృతమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

మృతుల కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

రాయపర్తి, జనవరి 9 : మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మండలంలోని కొండూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు కర్ర రవీందర్‌రెడ్డి తల్లి కర్ర అమృతమ్మ(76) గుండెపోటుతో మృతి చెందగా ఆమె అంతిమ యాత్రలో ఎర్రబెల్లి పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు కర్ర నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ సర్పంచ్ కర్ర సరిత రవీందర్‌రెడ్డిని పరామర్శించారు. అలాగే, వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన షేక్ నన్నేసాహెబ్ మృతదేహానికి నివాళులర్పించారు. అవుసులకుంటతండా మాజీ సర్పంచ్ మూడు రంగమ్మ కుమారుడు మూడు చక్రునాయక్, మండలంలోని బంధన్‌పల్లి గ్రామానికి చెందిన చుక్కా రమేశ్ ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటాలకు మాజీ మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, జిల్లా నాయకుడు బిల్ల సుధీర్‌రెడ్డి, నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, ఉపేందర్, గూబ యాకమ్మ, మూడు రవీందర్, మునావత్ రవినాయక్, హపావత్ సోమానాయక్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, భూక్యా దీప్లానాయక్ తదితరులు ఉన్నారు.

కరపత్రాన్ని విడుదల చేస్తున్న ప్రేమ్‌సాగర్

ప్రాపర్టీ షోను వినియోగించుకోవాలి

క్రెడాయి రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్ సాగర్

నయీంనగర్, జనవరి 9 : వడ్డేపల్లి రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో ఈ నెల 11,12న క్రెడాయి వరంగల్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ తెలిపారు. గురువారం కేయూ జంక్షన్ సమీపంలోని వారి కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. నూతనంగా ఇల్లు, విల్లా, అపార్ట్‌మెంట్ కొనుగోలు చేయాలనుకునే వారు లేదా సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారికి ఇది మంచి అవకాశమని, లోన్ సౌకర్యం కోసం వివిధ బ్యాంకర్లను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామని తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, అమరేందర్, అమరలింగేశ్వర్, రవీందర్, మనోహర్ రాజేందర్, రజినీకాంత్, నాగరాజు, హరిప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై అలసత్వాన్ని ఉపేక్షించం

డీఎంహెచ్‌వో సాంబశివరావు

డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న సిబ్బంది

నల్లబెల్లి, జనవరి 9 : ప్రజల ఆరోగ్యంపై వైద్యాధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని డీఎంహెచ్‌వో సాంబశివరావు అన్నారు. నల్లబెల్లి పీహెచ్‌సీని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వోను స్థానిక సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోరిక రవీందర్‌నాయక్, వైద్యాధికారి ఆచార్య, అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌చారికి నివాళి

నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

నర్సంపేట, జనవరి 9 : నర్సంపేటకు చెందిన తెలంగాణ అమరవీరుడు తొగిటి రాజ్‌కుమార్‌చారి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జనతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్‌కుమార్ విగ్రహానికి యూత్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోయూత్ అధ్యక్షుడు శ్రీరామోజు మురళి, నెల్లుట్ల శివకుమార్, కోమాండ్ల గణేశ్, గంప కమల్, మొగిలిచర్ల రాము, సంగినేని నిఖిల్, తొగిటి కళాధర్ పాల్గొన్నారు.

వరంగల్ రేడియో కేంద్రంలో నాచినపల్లి విద్యార్థులు

రేడియో కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

దుగ్గొండి, జనవరి 9 : నాచినపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వరంగల్ ఆకాశవాణి రేడియో కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ప్రతి ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమయ్యే చిన్నారిలోకం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ సందేశాలు, 'రోబోనా మజాకా' నాటిక, దేశభక్తి గేయాలు ఆలపించగా రికార్డింగ్ చేసినట్లు జీవశాస్త్ర టీచర్ వెలుదండి సుమలత తెలిపారు.

बैंक ऑफ महाराष्ट्र బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర భారత సరకార కా ఉద్యమ एक परिवार एक बैंक

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

జోనల్ కార్యాలయం: ఇం.నెం. 4-3-448 నుండి 460 & 465 నుండి 468, మొదటి అంతస్తు, వినూత్న పిట్టీస్ మెజెస్టీ, గోపాల్ బాగ్, బ్యాంక్ స్ట్రీట్ దగ్గర, కోఠి, హైదరాబాద్.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తాకట్టు పెట్టిన/ఛార్జ్ చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెక్యూర్డ్ క్రెడిటార్** యొక్క అధీకృత అధికారిచే **నిర్మాణాత్మక/భౌతిక/లాంఛనప్రాయ** స్వాధీనం చేసుకున్నవి దిగువ తెలిపిన రుణగ్రహీత(లు)/హామీదారు(లు) నుండి **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర**, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉన్న బకాయి మొత్తం + దానిపై వర్తించని వడ్డీ మరియు భవిష్యత్ వడ్డీ ప్లస్ ఖర్చులు మరియు ఇతర చార్జీలు రాబట్టుకొనుట కొరకు **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికన **28-01-2025**న విక్రయించబడతాయని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

క్ర.సం.	రుణగ్రహీత మరియు హామీదారు పేరు	బకాయి మొత్తం
1	**1) M/s మెడ్‌ఫిన్ ఫార్మా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్**, #ఇం.నెం. 9-10-48, పిన్నవారివీధి, వరంగల్, తెలంగాణ-506 002. **2) శ్రీ మీరిపెల్లి కమలాకర్ (డైరెక్టర్, తనఖాదారు & హామీదారు)**, నివాసం: ఇం.నెం. 9-10-48, పిన్నవారివీధి, వరంగల్, తెలంగాణ-506 002. **3) శ్రీమతి మీరిపెల్లి ఉమాదేవి (డైరెక్టర్ & హామీదారు)**, నివాసం: ఇం.నెం. 9-10-48, పిన్నవారివీధి, వరంగల్, తెలంగాణ-506 002.	**రూ. 1,95,89,330/- (ఒక కోటి తొంభై ఐదు లక్షల ఎనభై తొమ్మిది వేల మూడు వందల ముప్పై రూపాయలు మాత్రమే)** + దానిపై వర్తించని వడ్డీ మరియు భవిష్యత్ వడ్డీ ప్లస్ ఖర్చులు మరియు ఇతర చార్జీలు.
	స్థిరాస్తి వివరణ: తెలంగాణ-506 002,వరంగల్, దుర్గేశ్వర స్వామి గుడి వీధి వద్దగల 74.77 చ.గజాల మొత్తం విస్తీర్ణానికి కార్పొరేషన్ నెం. 9-10-48, కొత్త నెం. 9-10-47కి అనుగుణంగా మున్సిపల్ నెం. 9/600 పాత గల ఇల్లు మరియు ఖాళీ స్థలం యావత్తు మరియు **సరిహద్దులు: ఉత్తరం:** తోర్నాల భద్రయ్య ఇల్లు, **దక్షిణం:** డి.రాజయ్య మరియు ఇతరుల ఇల్లు, **తూర్పు:** బెజుగం సంగయ్య మిగిలిన ఇల్లు, **పడమర:** రోడ్.	
	రిజర్వు ధర: రూ .66,84,000/-	**బయానా (EMD): రూ .6,68,400/-**
	స్థిరాస్తి వివరణ: తెలంగాణ-506 002,వరంగల్, కరీమాబాద్ వద్దగల విస్తీర్ణం 329.72 చ.గజాల నివాసపు ఇం.నెం. 17/198 (పాత), 17-2-536 (కొత్త) యావత్తు మరియు **సరిహద్దులు: ఉత్తరం:** 20 అ. వెడల్పు రోడ్, **దక్షిణం:** గొడగు వైకుంఠం ఇల్లు, **తూర్పు:** 20 అ. వెడల్పు రోడ్, **పడమర:** రాగం సులోచన ఇల్లు మరియు ఖాళీ స్థలం.	
	రిజర్వు ధర: రూ .59,59,200/-	**బయానా (EMD): రూ .5,95,920/-**

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ https://www.bankofmaharastra.in; https://ebkray.in/eauction-psbలో ఇచ్చిన లింక్‌ని చూడండి. సంప్రదించు నెం. 8956963885.

గమనిక: స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు లేదా చట్టప్రకారం వర్తించు ఏవేని ఇతర ఖర్చులు వంటి కన్వేయన్స్ నిమిత్తం చెల్లించబడు అన్ని ఛార్జీలు, ఫీజులు గెలుపొందిన బిడ్డరే భరించాలి. అన్ని చట్టబద్ధమైన/చట్టబద్ధతలేని బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్లు, ఛార్జీలు/ఫీజులు మొ॥వి గెలుపొందిన బిడ్డరే బాధ్యత వహిస్తారు.

ప్రదేశం: హైదరాబాద్, తేది: 09-01-2025. సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.